



వ్యూహాల అమ్ములపొది

# అతడే.. ఓ సైన్యం!

ఏమాత్రం పొగరాదు... శబ్దం వెలువడదు... విస్ఫోటనంతో భూకంపం వచ్చి అల్లల్లాడాల్సిందే! అయితే, అది బాంబు కాదు... రాజకీయ ఎత్తుగడ! ప్రత్యర్థులకు దిమ్మదిరగాల్సిందే... కోలుకునేలోపు జరిగిన అపార నష్టాన్ని కూడా అంచనా వేయలేని దుస్థితి వారిది! దాని వ్యూహ నిర్మాత మూడక్షరాల సంక్షిప్త నామ స్వరూపం కేసీఆర్! ఆయన మౌనం వహించాడంటేనే వణుకు మొదలవుతుంది... అది దీర్ఘకాలం సాగిందంటే తుపాను ముందు ప్రశాంతతే!

## సకల జనుల సంక్షేమవాది

- మెరుపు వేగం.. ఉరమని విస్ఫోటనం
- అమూలాగ్ర సమస్యాన్వేషి.. మౌనమే ఓ ఎత్తుగడ
- కాకలుతీరిన యోధాను యోధులకే గుగ్గురువు!



**ఎన్నికల వేళ... ప్రస్తుతం ప్రత్యర్థి పార్టీలు నానా హంగామా చేస్తున్నాయి. చేరికల హడావుడికి తెరలేపాయి. చోటామోటా నేతలను చేర్చుకుని భూమి బద్దలైపోయినట్టు బిల్డప్ ఇస్తున్నాయి.. అలాంటి ఉడుత ఊపులకు కేసీఆర్ ఏమాత్రం అనకడు, బెణకడు అన్నట్టు వ్యవహరిస్తూ గంబీరంగా ముందుకు సాగుతున్నారు.**

హైదరాబాద్, ఆంధ్రప్రభ:

కర్నాటక ఎన్నికల తర్వాత ముఖ్యంగా కాంగ్రెస్ పెద్దల హంగామా ఎక్కువైంది. డిక్లరేషన్లు, గ్యారంటీలంటూ హోరెత్తి స్తోంది. ఏమాత్రం హడావుడి లేకుండానే మేని ఫెస్టోను ప్రకటించి ప్రకంపనలు సృష్టించిన కేసీఆర్ ఆ తర్వాత విస్తృత స్థాయిలో ప్రచారం మొదలు పెట్టారు. తెలంగాణ అమూలగ్రం క్షుణ్ణంగా తెలి సిన కేసీఆర్ ఏ ప్రాంతంలో ఏ నియోజకవర్గంలో ఏ ఊళ్లో ఏ ఇంట్లో ఏ సమస్య ఉందో ఎలా పరిష్కరిం చాలో అధ్యయనంతో తెలుసుకున్న అపార అను భవం ఆయనది! ఇందుకు తెలంగాణ కుటుంబ సర్వే డేటా ఆయనకు నేడు అర్జునుడి అంబుల పొదిగా మారింది. అది ఎప్పటికీ నిండుగానే ఉంటుంది... అన్నిరకాల శక్తివంతమైన అమ్ములతో! గత ఎన్నికల్లో కూడా ఆయన వేసిన ఎత్తులకు బిత్తరపోయిన ప్రత్యర్థులు చిత్తయిపోయి మళ్లీd కోలుకోవడానికే అయిదేళ్లు పట్టింది! ఆయన వెనుకడుగు వేసినట్టు కనిపించిందంటేనే పంజా పదునెక్కిందని అర్థం. ఇక ఆయన ప్రగతిభవన్‌లో ఉన్నా ఫామ్‌హౌస్‌లో ఉన్నా ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే శ్వాసగా గడుపుతారు. ఇందులో ఎత్తుగడలు, ప్రతివ్యూహాలు, ప్రణాళికలు కలగలిసి ఉంటాయి! దేశంలో ఆరితేరిన రాజకీయనేతలు, విశ్లేషకులకు సైతం ఆశ్చర్యం కలిగించేలా ఆయన రాజకీయ కదలికలు ఉంటాయి. ఇక నియోజక వర్గాల వారీగా ఆయన సమాచారాన్ని ఎప్పటి కప్పుడు వివిధ మార్గాల ద్వారా తెలుసుకుంటుం టారు. తన అనుభవంతో వాటిని సరిపోల్చుకుం టారు. ఏమాత్రం తేడా కనిపించినా వెంటనే రకర కాల ప్రణాళికలను వివిధ మార్గాల ద్వారా అమలు చేస్తుంటారు. అవేంటో తెలుసుకునేలోపే భారాసకు అనుకూలంగా, ప్రత్యర్థి కోలుకోలేని రీతలో పరిస్థితులు అకస్మాత్తుగా మారిపోతుంటాయి. అంటే ప్రత్యర్థులు నిద్ర లేచే లోపే సర్జకల్ స్ట్రయిక్‌లు జరుగుతుంటాయి. అన్నిచోట్ల అన్ని రకాల వ్యూహ ప్రతి వ్యూహాలను ఏకకాలంలో అమలు చేయగల దిట్ట కాబట్టే ఆయన సవ్యచాచి!

### ఎక్కడ తగ్గాలో, ఎక్కడ నెగ్గాలో..

రాజకీయ రంగంలో ఎన్నో పీహెచ్‌డీలు చేసిన కేసీఆర్‌కు ఎక్కడ తగ్గాలో ఎక్కడ నెగ్గాలో తెలుసు! ...అందుకే ఆయనకు చిన్న అవకాశం చిక్కినా పరమాణువును సైతం పెను విస్ఫోటనం చెందేలా చేయగల కాకలు తీరిన నేతలకే ఆయన గుగ్గురువు అని రాజకీయ పండితులే వ్యాఖ్యానిస్తుంటారు! తెలంగాణలో ఏ మూల ఏ సమస్య ఉందో ఆయనకు తెలిసినంతగా మరెవరికీ తెలియదు. పైగా... సమస్య పురుడు పోసుకోగానే దాని లోతుపాతులు అంచనా వేయగల సత్తా ఆయన సొంతం. వెంటనే అందుకు పరిష్కారాన్ని కూడా ఆయన రూపొందిస్తారు. దానికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తారు. అందరికీ ఆమోదయోగ్యంగా మార్చగల ట్రబుల్ షూటర్స్‌ను అమలు చేసేందుకు నియోగిస్తారు.

### అందరికంటే ముందే అభ్యర్థులకు బీ ఫామ్‌లు..

భారాస అభ్యర్థులకు బీఫామ్‌లు ఇచ్చారు. ఎన్నికల ప్రచారం మొదలైంది. రెండు రోజుల క్రితం ఓ అభ్యర్థి ఫోన్ మోగింది. అవతలి వ్యక్తి సాక్షాత్తు కేసీఆర్! ఏమయ్యా... మీ ఊళ్లో ఫలానా వ్యక్తి ఇంట్లో ఈ సమస్య ఉంది ఏం చర్యలు తీసుకున్నావ్... అని అడిగారు. బిత్తరపోవడం ఆ అభ్యర్థి వంతు అయింది. వెంటనే తేరుకుని సర్... రేపే మాట్లాడతాను సర్ అన్నాడు. అలాకాదు... నువ్వే స్వయంగా ఆయన ఇంటికి వెళ్లు... మీకు ఈ సమస్య ఉంది... సీఎం కేసీఆర్ దృష్టికి వచ్చింది. మీతో స్వయంగా ఆయనే చెప్పమన్నారు... మళ్లీd ఎన్నికలు ముగియగానే మీ సమస్యను ఈవిధంగా తీరుస్తానని వివరంగా చెప్పు. ఆయనకు ఎదురైన ఈ సమస్య తాత్కాలికమేనని చెప్పు... గద్దెనెక్కిన వెంటనే నువ్వు తీర్చాల్సిన మొదటి సమస్య ఇదే... ఈ విధంగా ఊరందరి ముందు ఆయనకు హామీ ఇవ్వు. అలాగే, ఇంకా ఆ ఊళ్లో ఏమేమి సమస్యలు ఉన్నాయో తెలుసుకో... అని కేసీఆర్ చెప్పడంతో ఆ అభ్యర్థికి నోట మాట రాలేదు! ఇలా ఉంటుంది కేసీఆర్ వద్ద సమాచారం!

### అన్ని పథకాలపై సమగ్ర అవగాహణ

ప్రతి ఇంటికీ ఏయే పథకం అందిందీ, ఇంకా ఏమేమి చేయవచ్చు... ఎంతమంది అర్హత కలిగి ఉన్నారు... రేషన్ కార్డు నుంచి సీఎం సహాయ నిధి వరకూ ఏవిధమైన సహాయం చేయవచ్చో సమగ్రంగా, సవివరంగా ఆయన వద్ద కీలక సమాచారం విశ్లేషించి మరీ అందుబాటులో ఉంది. దీంతో ఎవరికి ఏమేమి పథకాలు ఇంకా అందించడానికి అవకాశం ఉందో అవన్నీ ఎలా ఆచరణలోకి తీసుకురావచ్చో ఆయన వద్ద ప్రణాళికలున్నాయి. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాలు, అన్ని నియోజకవర్గాలు, అన్ని కుటుంబాల్లో ఏయే సమస్యలున్నాయో ఇట్టే తెలుసుకోగలుగుతున్నారు.

### పరిష్కార మార్గాల అన్వేషణ

దేవుడే అందరికీ మంచివాడు కాని ఈ రోజుల్లో తెలంగాణ లోని సమగ్ర కుటుంబ సర్వే డేటా ద్వారా ఆయన ఇంటింటి సమస్యను తన సొంత సమస్యగా పరిగణిస్తారు. అందుకు సరైన పరిష్కారమార్గాన్ని పెద్దకొడుకులా ఆలోచిస్తారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక సమస్యలకు అనుగుణంగా భారాస పథకాలు అందేలా చూస్తారు. ఇంత ముందుచూపు కలిగిన నేత కనుకే ఆయనకు నిన్న, నేడు, రేపు కూడా నీరాజనాలు పట్టడానికి తెలంగాణ సమాజం సంసిద్ధంగా ఉంది.

---

# వైనాట్.. 175?

**నేటి నుంచి వైసీపీ బస్సు యాత్ర**

**సంక్షేమం, అభివృద్ధి పథకాలతో ప్రజల్లోకి ఉత్తరాంధ్రలో ప్రారంభం కానున్న యాత్ర రోజూ మూడు ప్రాంతాల్లో సభలకు ప్లాన్**

వైనాట్ 175 నినాదంతో దూకుడు పెంచుతోన్న వైసీపీ ప్రజాక్షేత్రంలో యాక్టివ్ అయ్యేలా ప్రణాళికలు చేస్తోంది. YCP పాలనలో చేసిన సంక్షేమం, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 4 కార్యక్రమాలు చేపట్టనున్నట్టు పార్టీ అధినేత జగన్ తెలిపారు. అందులో భాగంగానే బస్సు యాత్రతో నియోజకవర్గాలు చుట్టేసేందుకు ప్లాన్ చేసింది వైసీపీ. గురువారం సామాజిక సాధికార యాత్ర పేరిట ఉత్తరాంధ్రలో యాత్ర ప్రారంభం కానుంది. ఇచ్ఛాపురం, కోస్తాలోని తెనాలి, రాయలసీమలోని శింగనమల నియోజకవర్గాల్లో ఒకేసారి యాత్రను ప్రారంభించనున్నారు.

### చంద్రబాబు అరెస్టు తర్వాత..

ఏపీలో చంద్రబాబు అరెస్ట్ అనంతరం రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. టీడీపీతో జనసేన పొత్తుతో పొలిటికల్ హీట్ పెరిగింది. ఇప్పటికే జనసేన వారాహియాత్రతో ప్రజల్లోకి వెళ్తుండగా.. బుధవారం నారా భువనేశ్వరి నిజం గెలవాలి యాత్రకు శ్రీకారం చుట్టారు. త్వరలోనే లోకేష్ కూడా ప్రజాక్షేత్రంలోకి వచ్చే అవకాశాలున్నాయి. దీంతో టీడీపీ, జనసేనకు దీటుగా యాక్టివ్‌గా ప్రజల్లోకి వెళ్లేం దుకు వైసీపీ బస్సుయాత్రకు శ్రీకారం చుట్టింది. రోజుకు 3 నియోజకవర్గాలు పర్యటించి.. డిసెంబరు31వరకు మొత్తం 39నియోజకవర్గాలను చుట్టేసేలా ఈ యాత్రను వైసీపీ ప్లాన్ చేసింది.

### అలర్ట్ అయిన వైసీపీ..

బుధవారం ఢిల్లీలో అమిత్ షా, పవన్ కల్యాణ్ భేటీతో కూడా వైసీపీ అలర్ట్ అయింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తుపై షా, పవన్ మధ్య చర్చలు జరగడంతో పరిణామాలపై ఆరా తీస్తోంది వైసీపీ అధిష్టానం. ఇప్పటికే టీడీపీతో పొత్తు ప్రకటించే సమయంలో పవన్ తమతో బీజేపీ కలిసి వస్తే బాగుంటుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో బీజేపీ, జనసేన పొత్తు కన్ఫామ్ అయితే ఆ ఎఫెక్ట్ ఏపీపై పడే అవకాశాలున్నాయనే భావనలో ఉంది వైసీపీ. అందుకే సంక్షేమాస్త్రంతో ఇప్పటినుంచే ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయం తీసుకుంది వైసీపీ.

### నియోజకవర్గాల్లోనూ సభలు

యాత్రలో భాగంగా నియోజకవర్గాల్లో సభలను నిర్వహిస్తారు. రోజూ 3ప్రాంతాల్లో 3 సభలు నిర్వహించనున్నారు. స్థానిక ఎమ్మెల్యే లేదా నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త సారథ్యంలో ఈ యాత్ర జరగనుంది. రాష్ట్రంతో పాటు ఆ నియోజకవర్గంలో సంక్షేమాభివృద్ధి పథకాలు, పదవుల పంపకంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చేసిన ప్రయోజనాన్ని ఈ యాత్ర ద్వారా ఆయా వర్గాలకు చెందిన మంత్రులు, వైసీపీ నేతలు వివరించనున్నట్లు సమాచారం.

